క్లుప్తంగా

నేడు బీజేపీ బైక్ ర్యాలీ

ఆసిఫాబాద్అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల గారడీ, 66 మోసాలను ఖండిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు అరిగెల మల్లిఖార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా పధాదికారులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

‘చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపండి’


విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న ఎంఈవో

కెరమెరి: చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని దేవాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులతో బోర్డుపై తెలుగు, ఆంగ్ల పదాలను రాయించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వంటశాలల్లో శుచి, శుభ్రత పాటించాలన్నారు. నాణ్యమైన విద్యతో పాటు, రుచికరమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. ప్రతీ వారంలో మూడుసార్లు గుడ్లు వడ్డించాలని తెలిపారు.

‘ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి’

తిర్యాణి: ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని టీఎస్ యూటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, మడావి గోపాల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో సంఘం మండలస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా ఆత్రం పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా మడావి శేషు, ఉపాధ్యక్షులుగా మడావి లచ్చు, జగ్గారావు, విజయలక్ష్మి, కోశాధికారిగా హన్మంత్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా మన్మధ రావు, చిన్నయ్య, ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా పెందూర్ సుభాష్, కుర్సెంగ శ్రీనివాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారులు సైతం కృష్ణరావు, వెద్మ యశ్వంత్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఇన్‌చార్జి, ప్రత్యేకాధికారి ప్రసన్న భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించుటకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోపు లింగాపూర్ కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత ప్రదర్శన

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రాజంపేట శివారులో సోమవారం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రదర్శన ద్వారా వివరించారు. కళాజాత బృందం సభ్యులు గొడిసెల బాపు, పవార్ మోహన్ నాయక్, సోమశేఖర్, పురుషోత్తం, శిరీష, వెన్నెల, సురేందర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్షణగా షీటీం

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు, విద్యార్థులకు షీటీం రక్షణ కల్పిస్తుందని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. సోమవారం జిల్లాలోని జ్యోతిబా పూలే బాలికల గురుకుల విద్యార్థులకు షీటీం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు హింస, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. బాధితులు 87126 70564 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారంపై అప్రమత్తత అవసరం

ఆసిఫాబాద్: గ్రామాల్లో పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎఫ్ఆర్వో యోగేశ్ కులకర్ణి అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులకు జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో పులి సంచారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీపీవో భిక్షపతి, ఫీల్డ్ బయాలజిస్ట్ ఎల్లంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తి ఏరివేత సందర్భంగా కూలీలు మాస్కులు ధరించాలని, గుంపులుగా వెళ్లాలన్నారు.

సమస్యల్లో ‘పాటగూడ’

- కనిపించని అభివృద్ధి
- నేటికీ మంజూరు కాని ప్రభుత్వ గృహాలు
- పూరి గుడిసెల్లోనే జీవనం
- రాళ్లు తేలి అధ్వానంగా రోడ్డు
- అధికారులు స్పందించాలని వేడుకోలు


పాటగూడ గ్రామం


కంకర తేలిన పాటగూడ రోడ్డు


అలంకారప్రాయంగా మంచినీటి ట్యాంక్

కెరమెరి: ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అధికారులు మారుమూల గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకోవడం లేదు. తాగేందుకు నీరు, ఉండేందుకు ఇళ్లు లేక ప్రజలు సతమతమవుతున్నారు. ఏళ్లుగా అవస్థలు పడుతున్నా పట్టించుకునేనాథులే కరువయ్యారు. మండంలోని పాటగూడ గ్రామంలో 42 కుటుంబాలు 220 జనాభా ఉంది. ఈ ఆదివాసీ గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రభుత్వాలు గతంలో ఎన్నో విడతలుగా ప్రభుత్వ గృహాలు మంజూరు చేసినప్పటికీ నేటికి వారికి ఒక్క గృహం కూడా దక్కలేదు. ఫలితంగా వారు ఇప్పటికీ గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు.

కంకర రోడ్డుతో సరి..

అక్కడున్న విద్యార్థులకు బడి లేకపోవడంతో ఇతర గ్రామాల్లోని పాఠశాలల్లో చదువుకుంటున్నారు. మినీ అంగన్‌వాడీలో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరేళ్ల క్రితం వేసిన రోడ్డు ప్రస్తుతం కంకర తేలి నడిచేందుకు యోగ్యంగా లేకుండా పోయింది. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నిరుపయోగం..

ప్రస్తుతం గ్రామంలో రెండు చేతిపంపులు ఉన్నాయి. కాగా ఎండాకాలంలో భూగర్భజలం ఎండిపోయి బావి నీరే దిక్కవుతుంది. మిషన్ భగీరథలో భాగంగా లక్షలు వెచ్చించి ట్యాంకు నిర్మించారు. నల్లాలు అమర్చారు. కాని అవి అలంకార ప్రాయంగా మారాయి. ఉన్న బావిపై కూడా ఎలాంటి పైకప్పు లేక పోవడంతో బావి ప్రమాదకరంగా ఉంది.

ఇందిరమ్మ గృహాలపై ఆశలు



సుమారు 50 ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం. నేటికీ ప్రభుత్వ గృహం మంజూరు కాలేదు. గ్రామంలో ఒక్కరికి కూడా పక్కా ఇళ్లు లేదు. నేటికి పూరి గుడిసెల్లోనే ఉంటున్నాం. ఇందిరమ్మ గృహాలపై గంపెడాశలతో ఉన్నాం. – ఆత్రం పావుగా, పటేల్

మరమ్మతులు చేపట్టాలి



గతంలో వేసిన తారురోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారింది. ఎక్కడిక్కడ కంకర తేలి నడిచేందుకు యోగ్యంగా లేకుండా పోయింది. బడి లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలి. – సిడాం గంగుబాయి, పాటగూడ

కాలిబాటలే రహదారులు

- అధ్వానంగా రోడ్లు
- ప్రజలకు తప్పని తిప్పలు
- అటవీ అనుమతులు లేక సాగని పనులు


ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారిన రోడ్డు

తిర్యాణి: మండలంలోని పలు గూడేల్లో కాలంతో పని లేకుండా ప్రతీ అవసరానికి కాలినడకనే శరణ్యమవుతోంది. కనీసం ఇప్పటి వరకు ఆ గ్రామాలకు అంబులెన్స్ వచ్చిన పరిస్థితి లేదు. దీంతో అత్యవసర సమయంలోనూ గర్భిణీలు, రోగులను ఎడ్లబండ్లలోనే తరలించాల్సిన దుస్థితి ఉంది. కాగా ఇటీవల కురిసిన వర్షంతో మళ్లీ రోడ్డు బురదమయంగా మారడంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎర్రబండ, కేరిగూడ, గీసిగూడ, తాటిగూడ, కొటగాం, పూనగూడ, కొత్తగూడ గ్రామాలకు నేటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు.

కాలిబాటలే దిక్కు..

గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అక్కడి ఆదివాసీలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. శీతాకాలం, ఎండాకాలంలో కొంతవరకు దారిపై ద్విచక్ర వాహనాలు, నడకకు అనుకూలంగా ఉంటుండగా వర్షాకాలంలో మాత్రం వర్షపు నీటితో రోడ్డుపై కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంటుంది. ఒక్కోసారి దారి ఆనవాళ్లు కూడా కనబడని దుస్థితి నెలకొంటుంది. ఏటా వర్షాకాలంలో ఆయా గ్రామాలకు బహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. సరైన రహదారి లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. దీనికి తోడు గ్రామాలకు వెళ్లే దారిలో వాగులు ఉండటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొటగాం నుంచి దాంపూర్ వరకు రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేసి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా అటవీ అనుమతులు లేక రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే..

వర్షాకాలంలో గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండకపోవడంతో కాలినడకనే ఇతర గ్రామాలకు వెళ్తుంటారు. ప్రతీ నెల నిత్యావసర సరుకుల కొనుగోలుకు, రేషన్‌బియ్యం తీసుకోవడానికి, ఆసరా పింఛన్ల కోసం సుమారు ఆరు కిలోమీటర్ల కాలినడకన దాంపూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి వారిది. అక్కడి నుంచి ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తిర్యాణి మండల కేంద్రానికి చేరుకుని అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మస్తు కష్టమవుతుంది..



మా గ్రామానికి నేటికీ సరైన దారి లేకపోవడంతో అత్యవసర సమయంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షకాలంలో కాలినడకన వెళ్లడం కూడా కుదరని పరిస్థితి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– తురం బక్కు, కొటగాం

అటవీ అనుమతులు లేక..



రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే అధికారులు సర్వే చేపట్టి ప్రతిపాదనలు పంపించారు. కానీ అటవీ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభం కావడం లేదని అధికారులు చెబుతున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అటవీ అనుమతులు తీసుకొచ్చి పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి.

– కోట్నాక గణపతి, తాటిగూడ

సీఎం కప్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: నేటి నుంచి ప్రారంభమయ్యే మండల స్థాయి సీఎం కప్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర ఆటలు మండలంలోని మోడి, హట్టి ఆశ్రమ పాఠశాలల్లో కొనసాగుతాయని పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఆటలను ముగించాలని, టీంలు అధికంగా వస్తే రోజులు పెంచుతామన్నారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, తహసీల్దార్ దత్తు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానం, భీమన్న స్టేడియంలో మంగళవారం నుంచి ఈనెల 12 వరకు సీఎంకప్ మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి. రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మలు ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్ (జూనియర్స్), ఫుట్‌బాల్ (పురుషులు, మహిళలు), ఖోఖో (పురుషులు, మహిళలు), కబడ్డీ (పురుషులు, మహిళలు), యోగా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన క్రీడాకారులు మంగళవారం ఉదయం 8.30 గంటలకు గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శ్రావణ్ కుమార్

వాంకిడి: మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలలో సోమవారం జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ అధికారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. హెచ్‌ఎం లక్ష్మి ప్రసన్న, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ పితాంబర్, సుకన్య, శకుంతల, సుగుణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు

రెబ్బెన: సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల రక్షణ కోసం యాజమాన్యం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, జీఎం ఆర్‌అండ్‌డీ ఆర్. నారాయణరావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో సోమవారం 55వ రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించగా ఏరియా జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఓసీపీ ఆవరణలో రక్షణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల రక్షణ కోసం యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపడుతుందన్నారు. నిర్లక్ష్యం, వేగంగా పని ముగింపు ప్రమాదాలకు మూల కారణమన్నారు. సమష్టిగా పని చేసే సమయంలో ఒక్కరి నిర్లక్ష్యం పది మందికి ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని హెచ్చరించారు. కళాకారులు పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యత వివరించారు. క్వారీ లోపలికి వెళ్లి రక్షణ చర్యలను పరిశీలించారు. ప్రథమ చికిత్స కేంద్రాన్ని సందర్శించి ప్రథమ చికిత్స అందించే విధానాన్ని పరిశీలించారు. మినీ బెల్యూబ్రికేషన్ సిస్టం ప్రారంభించారు. 54వ రక్షణ పక్షోత్సవాల్లో ఖైరిగూడకు వచ్చిన సేఫ్టీ అవార్డును అందచేశారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏఐటీయూసీ నాయకులు బయ్యమొగిళి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఫిట్ ఇంజనీర్ వీరన్న, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న తహసీల్దార్

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువుల్లో రాణించాలని తహసీల్దార్ పి. రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని పులికుంట కాలనీ పాఠశాల విద్యార్థులకు ఇన్ఫోర్ సాఫ్ట్‌వేర్ సంస్థ సహాయంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ద్వారా విద్యార్థుల కోసం రూ. 1.56లక్షల విలువైన విద్యా సామగ్రి, ఆటవస్తువులు, స్కూల్ బ్యాగ్స్, వాటర్ ప్యూరిఫైర్, ఆల్మారాలు అందించగా తహసీల్దార్ పంపిణీ చేశారు. ఎంఈవో వెంకటేశ్వర్, తక్కళ్లపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఏపీసీ చైర్మన్ లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ పోషన్న, ఉపాధ్యాయులు రాజేందర్, టి.శ్రీనివాస్, మమత, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, మాజీ సర్పంచ్ పోషమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు సమ్మె నోటీసు అందజేత


సమ్మె నోటీసు అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

వాంకిడి: సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం నాయకులు సోమవారం ఎంఈవో శివచరణ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, అప్పటి వరకు పేస్కేల్ ఇవ్వాలని, ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా, ఉద్యోగ బీమా కల్పించాలనే తదితర డిమాండ్లతో ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు సమ్మె నోటీసులో పేర్కొన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో సెండె లలిత, మీన, యశ్వంత్, సందీప్, సరస్వతి, తులసీరాం, తిరుమల తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలి


మాట్లాడుతున్న బౌద్ధ సంఘం నాయకులు

వాంకిడి: ఎస్సీ వర్గీకరణతో బౌద్ధులుగా ఉన్న మహర్ కులస్తులకు అన్యాయం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం దీనికి మద్దతుగా చేపట్టిన ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో సంఘ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ మాహర్‌లు అభివృద్ధి చెందలేదన్నారు. నాయకులు ఉప్రె విజయ్, జైరాం, హంసరాజ్, విలాస్, రాజేంద్ర ప్రసాద్, రాజేశ్వర్, రోషన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య

రెబ్బెన: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఆసిఫాబాద్ సీడీపీవో సాదికా రుక్సానా అన్నారు. మండలంలోని గోలేటిలో ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు బాలమేళాను ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. మాజీ సర్పంచ్ పోటు సుమలత, సూపర్‌వైజర్లు తిరుపతమ్మ, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, సంధ్యారాణి, మంజుల, సుశీల, మల్లీశ్వరీ, భాగ్యలక్ష్మి, బాలమ్మ, సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘పర్యవేక్షణ లోపంతో విద్యార్థిని మృతి’

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లా ఉన్నతాధికారి పర్యవేక్షణ లోపంతోనే వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతిచెందిందని మాలి సంక్షేమ సంఘం నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ఎదుట సోమవారం మాట్లాడారు. వసతిగృహంలో భోజనం విషయంలో జరిగిన నిర్లక్ష్యంతోనే ప్రాణాలు కోల్పోయిందన్నారు. విద్యాశాఖ కమిషనర్ ఆర్‌ఎంపీల చికిత్సతో మృతిచెందినట్లు మాట్లాడటం సరికాదన్నారు. విద్యార్థిని మరణంపై అనుమానాలు ఉంటే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శైలజ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల వ్యవసాయ భూమి కేటాయించాలన్నారు. మాలి సంఘం డివిజన్ అధ్యక్షుడు మెంగాజీ, మండల అధ్యక్షుడు బాబురావు, ధాబా గ్రామ పటేల్ మహేందర్, సుధాకర్, కృష్ణ, నాగేష్, మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమంగా భూ బదలాయింపు

- అన్యాయంగా వేరొకరికి భూమి పట్టా చేసిన వైనం
- బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రం సమర్పణ


పట్టా పాసుపుస్తకంతో రైతు నీలం అశోక్

కౌటాల/చింతలమానెపల్లి: మండలంలో బతికున్న రైతుల మరణ ధ్రువీకరణ పత్రాలను సమర్పించి సదరు రైతులకు చెందిన భూములను వేరొకరికి బదలాయిస్తూ పలువురు అక్రమాలకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన నీలం అశోక్ అనే యువరైతుకు గ్రామం శివారులో వారసత్వంగా సంక్రమించిన ఎకరం భూమి ఉంది. 2018లో అప్పటి ప్రభుత్వం 65/193/3 సర్వే నంబర్‌లో ఉన్న ఈ భూమికి పట్టా ఇచ్చింది. 2022వరకు ఈ భూమిపై రైతుబంధు కూడా వచ్చింది. 2023లో రైతుబంధు రాకపోగా రుణమాఫీ కాలేదు. ఆలస్యంగా గమనించిన రైతు 2024లో ఆన్‌లైన్‌లో రికార్డులు తనిఖీ చేయగా తన భూమి వివరాలు లేక పోవడంతో అవాక్కయ్యాడు. గత ఆగస్టులో తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా ఎలాంటి స్పందన లభించలేదు. దీంతో వివరాలు సేకరించిన ఆయన తన భూమిని కాత్రె రేవాబాయి అనే మహిళ పేరుతో బదలాయించినట్లు తెలిసింది. ఈ భూమి లావుని పట్టా కాగా నిబంధనల ప్రకారం ఈభూమి కేవలం రైతు కుటుంబ సభ్యులకు మాత్రమే వారసత్వంగా సంక్రమిస్తుంది. దీంతో అక్రమానికి తెరలేపిన వ్యక్తులు రైతు పేరుతో మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబసభ్యుల ధ్రువీకరణపత్రం సైతం సమర్పించినట్లుగా తెలుస్తోంది. ఈ ఘటనపై తహసీల్దార్ మునావర్ షరీఫ్‌ను సంప్రదించగా ఈ అక్రమంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. అన్ని అర్హతలు ఉంటేనే పట్టా బదలాయింపు జరుగుతుందని, సదరు రైతు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు. కాగా బతికుండగానే భూములను ఇతరులకు బదలాయించిన ఘటనలు మండలంలో గతంలోనూ చోటు చేసుకున్నాయి. మండలంలోని గంగాపూర్, బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన పలువురు రైతులు భూ అక్రమాలపై ఇప్పటికే ఫిర్యాదు చేశారు. అయినా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారని మండలవాసులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


జిల్లాకేంద్రంలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. రూప్‌నార్ రమేశ్, అసద్, గోపాల్‌నాయక్, వైరాగరె మారుతిపటేల్, శివ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు అనిల్, నాయకులు దాదాజీ, కొడప మారుతి, హన్మంతు, సుధాకర్, వడై పాండు, జయరాం, రమేశ్, ప్రకాశ్, ఎల్లయ్య, మొండి, పురుషోత్తం, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గ బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ కొడప విశ్వేశ్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సామల రాజన్న, రంగు సురేశ్ గౌడ్, దూగుంట శైలజ చారి, గుమ్ముల శ్రీనివాస్, ఔత్కార్ లక్ష్మణ్, కొట్రంగి శంకర్, వసాకే విజయ్, కుమ్మరి పోశం, గాండ్ల పోశం మహిళలు, రైతులు పాల్గొన్నారు.